రసాయనం.. అతిగా వాడితే అనర్థం

- పంటల్లో అవసరమైన మేరకే పురుగు మందులు
- మోతాదుకు మించితే పంట దిగుబడికే తీవ్ర నష్టం
- పిచికారీ సమయంలో జాగ్రత్తలు అవసరం
- రైతులు జాగ్రత్తలు పాటించాలంటున్న వ్యవసాయాధికారులు

పంటల్లో చీడపీడల నివారణ కోసం పురుగు మందులు వాడటం సర్వసాధారణం. అయితే ఇష్టానుసారం పంటలకు మందులు పిచికారీ చేస్తే మంచి జరగడం అటుంచితే దుష్ప్రభావాలే ఎక్కువగా ఉంటాయి. కొందరు రైతులు మందుల దుకాణంలో ఏది పడితే అది కొనుగోలు చేసి వాడుతుంటారు. ఇలా చేయడం వల్ల భూమి సారాన్ని కోల్పోవడమే కాకుండా పంట నష్టపోయే ప్రమాదం ఉంది. సాగు వ్యయం కూడా పెరుగుతుంది. పిచికారీ సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోకుంటే అనారోగ్య సమస్యలు వచ్చే అవకాశాలు ఉంటాయి. అవసరం మేరకు వినియోగిస్తే మంచిదని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు.

అవుకు: వ్యవసాయంలో రసాయన ఎరువులు, పురుగు మందుల వినియోగం ఎక్కువైంది. అవగాహన లేకుండా ఇష్టానుసారం వీటిని వినియోగిస్తే భూమి నిస్సారం అవుతుంది. దిగుబడులు కూడా తగ్గిపోతాయి. అలాగే కొందరు అవగాహన రాహిత్యంతో జాగ్రత్తలు తీసుకోకుండా మందులు పచికారీ చేస్తుంటారు. ఇలా చేయడం వల్ల వారి ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతాయి. వ్యవసాయ అధికారుల సూచనలు పాటిస్తూ తగిన మోతాదులో ఎరువులను వినియోగించడం ఉత్తమం.

పెరుగుతున్న రసాయన ఎరువుల వినియోగం

ప్రస్తుతం వ్యవసాయ రంగంలో రైతులు సరికొత్త పద్ధతుల్లో పంటలు సాగు చేయడంతో రసాయనిక పురుగు మందుల వినియోగం క్రమంగా పెరుగుతోంది. విత్తనాలు చల్లడం నుంచి పంట కోతకు వచ్చే వరకు పురుగుల మందు వాడకంపై రైతులు తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలి.



పంటకు మందు పిచికారీ చేస్తున్న రైతు (ఫైల్)

లేకపోతే పంట దిగుబడి దెబ్బతినంతో పాటు రైతు నష్టాల భారిన పడాల్సి వస్తుంది. మోతాదుకు మించి రసాయన ఎరువులు, క్రిమి సంహారక మందులు వినియోగిస్తే పంటపై ప్రభావం పడుతుంది. భూసారం తగ్గడంతో భూమి తన సహజత్వాన్ని కోల్పోతాయి. దీంతో లాభం కంటే నష్టం అధికంగా ఉంటుంది. పంటలకు నీటితడి అందించిన తర్వాత ఉదయం వేళల్లో పంటలకు పిచికారీ చేస్తే ఫలితం ఉంటుంది. 25 డిగ్రీల ఉష్ణోగ్రత ఉన్న సమయంలో పంటలకు పిచికారీ చేయాలని నిపుణులు చెబుతుంటారు. రైతులు పలు జాగ్రత్తలు తీసుకుని మందులు పిచికారీ చేస్తే ప్రమాదాల నుంచి గట్టెక్కవచ్చని, లేకపోతే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని ఇటు వైద్యులు, అటు వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు.

పిచికారీ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- గాలికి ఎదురుగా రసాయన మందులు పిచికారీ చేయరాదు.
- తెగులు, పురుగుల మందు కలిపి పిచికారీ చేయరాదు.
- చేతులకు గ్లౌజులు, నోరు, ముక్కుకు మాస్కులు వేసుకోవాలి.
- మందులు పిచికారీ చేసే సమయంలో కళ్లు, ముక్కు, నోరు చేతులతో రుద్దుకోరాదు. వాడిన పురుగు మందుల డబ్బాలు ఎక్కడబడితే అక్కడ వేయరాదు.
- రసాయన మందులు పిచికారీ చేసే సమయంలో స్ప్రేయర్లకు లీకేజీ లేకుండా చూసుకోవాలి.
- మందు డబ్బాపై సూచించిన మేరకు లేదా వ్యవసాయ అధికారులు సూచించిన మేరకు మిశ్రమాన్ని కలిపి పిచికారీ చేయాలి.
- పిచికారీ చేసే సమయంలో బీడీలు, సిగరెట్లు తాగరాదు.
- పిచికారీ చేసిన తరువాత భోజనానికి ముందు చేతులు సబ్బుతో శుభ్రం చేసుకోవాలి.

జాగ్రత్తలు పాటించాలి



పంటలపై క్రిమి సంహారక మందులు పిచికారీ చేసే సమయంలో రైతులు తప్పనిసరిగా జాగ్రత్తలు పాటించాలి. పిచికారీ సమయంలో అస్వస్థతకు గురైతే వెంటనే సమీపంలోని వైద్యుడిని సంప్రదించాలి. పురుగు మందు పిచికారీ చేసే సమయంలో కళ్లు, ముక్కు, నోటిలోనికి రసాయన మందు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. చేతులను శుభ్రంగా కడుక్కొని భోజనం చేయాలి. లేకుంటే రసాయన ద్రావణం కడుపులోకి వెళ్లే ప్రమాదం ఉంది.

–అభినయ్, సూపరింటెండెంట్, అవుకు సీహెచ్‌సీ

మోతాదుకు మించి వాడొద్దు



వ్యవసాయ సిబ్బంది సూచించిన మేరకు తగిన మోతాదులో పంటకు ఉదయం వేళల్లో మందులను పిచికారీ చేయాలి. ముఖానికి మాస్కులు, చేతులకు గ్లౌజులు, కళ్లకు అద్దాలు ధరించి పిచికారీ చేయాలి. కలుపు మందు కొట్టిన తరువాత పురుగు మందులు వాడొద్దు. మొక్కల పైభాగంతో పాటు కిందభాగం తడిసిపోయేలా పిచికారీ చేస్తే ఆకు కింద ఉన్న రసం పీల్చే పురుగులు నశిస్తాయి.

–అబ్దుల్ హక్, వ్యసాయాధికారి, అవుకు

- రసాయన మందు పిచికారీ చేసే సమయంలో కడుపుమంట, దద్దుర్లు, వస్తే సమీపంలోని వైద్యుడిని సంప్రదించాలి.

క్లుప్తంగా

విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దాలి



శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో ఎంఈఓ

కొలిమిగుండ్ల: విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎంఈఓ అబ్దుల్ కలాం సూచించారు. శిక్షా సప్తాహ్ వారోత్సవాల్లో భాగంగా రెండో రోజు మంగళవారం స్థానిక కస్తూర్బా పాఠశాలలో ఆయన పాల్గొన్నారు. జాతీయ విద్యా విధానం అమల్లోకి వచ్చి నాలుగో ఏడాది పూర్తయిన సందర్భంగా పాఠశాలల్లో కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. పరివర్తనాత్మక సంస్కరణలపై ప్రభుత్వాల నిబద్ధత తెలియజేయడమే శిక్షా సప్తాహ్ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. పాఠశాల విద్యార్థులకు పునాది అభ్యసన, సంఖ్యా శాస్త్రం నైపుణ్యాల అభివృద్ధిపై వివరించారు.

మినుములో సూక్ష్మధాతు పోషక లోపం



పసుపు రంగులోకి మారిన మినుము ఆకులు

కోవెలకుంట్ల: ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన మినుము పంటలో అధిక వర్షాల వల్ల సూక్ష్మధాతు పోషక లోపం కనిపిస్తోందని మండల వ్యవసాయాధికారి నిరంజన్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. ఇటీవల కురిసిన అధిక వర్షాల వల్ల ఐరన్ లోపించి ఆకులు పసుపు రంగులోకి మారాయన్నారు. దీని నివారణకు లీటరు నీటికి 8 గ్రాములు అన్నభేది(ఫెర్రస్ సల్ఫేట్), 1 గ్రాము నిమ్మ ఉప్పు, 2 ఎంఎల్ క్లోరిఫైరిపాస్ మందును కలిసి పిచికారీ చేయాలని సూచించారు. సకాలంలో ఈ మందులు వాడడం వల్ల సూక్ష్మ ధాతు లోపంతోపాటు ఆకులను ఆశించే చిత్త, రసం పీల్చు పురుగు బారి నుంచి పంటను కాపాడుకోవచ్చని పేర్కొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం



రక్తదాతం చేస్తున్న ఎస్‌బీఐ మేనేజర్

బేతంచెర్ల: రక్తదానం ప్రాణదానంతో సమానమని స్టేట్ బ్యాంక్ మేనేజర్ రవి తేజ అన్నారు. మంగళవారం పట్టణంలోని అమ్మా వారిశాల ఆవరణలో మండల ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఆర్యవైశ్యులతోపాటు పట్టణానికి చెందిన యువకులు, ఎస్బీఐ మేనేజర్ రవి తేజ సహా 50 మంది రక్తదానం చేశారు. అత్యవసర పరిస్థితుల్లో రక్తం అందక చాలా మంది ప్రాణాలు పోగొట్టుకుంటున్నారని.. అలాంటి పరిస్థితి రాకుండా ప్రతి ఒక్కరూ ముందుకొచ్చి రక్తదానం చేయాలని రవితేజ కోరారు. ఆర్య వైశ్య సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు కందగడ్డల జనార్దన్, విష్ణు, మోహన్ రావు, గుండా గోపాలు, సుధీర్, కల్కి సతీష్, రాజేంద్ర, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

వేతనాలు పెంచే వరకు సమ్మె కొనసాగిస్తాం



సమ్మె చేస్తున్న కార్మికులతో నాయకులు

డోన్ టౌన్: పెరిగిన ధరలకు అనుగుణంగా లారీ కార్మికుల వేతనాలు పెంచే వరకు సమ్మె ఆపే ప్రసక్తే లేదని లారీ మోటార్ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు భాస్కర్ రెడ్డి, శివరామ్ స్పష్టం చేశారు. మంగళవారం నుంచి లారీ డ్రైవర్లు, క్లీనర్లు చేస్తున్న సమ్మెకు వారు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. లారీ యజమానులతో పలు దఫాలుగా చర్చలు జరిపినా వేతనాలు పెంచలేదని.. చర్చలు విఫలం కావడంతోనే సమ్మెబాట పట్టినట్లు పేర్కొన్నారు. కార్మిక సంఘం నాయకులు సుబ్బారెడ్డి, వెంకటేశ్వర్లు, చంద్రశేఖర్‌రెడ్డి, ఆదినారాయణరెడ్డి, మద్దిలేటి, వెంకటరాముడు పాల్గొన్నారు.

జనావాసంలోకి జింక



బనగానపల్లె రూరల్: పట్టణంలోని కొండపేట కాలనీలోకి మంగళవారం ఓ జింక వచ్చింది. కాలనీకి చెందిన యువకులు కుక్కల బారిన పడకుండా జింకను పట్టుకున్నారు. జింకను ఫారెస్ట్ డీఆర్వో రామసుబ్బయ్య, బీట్ ఆఫీసర్ షెక్షావలికి అప్పగించారు. వైద్య పరీక్షలు నిర్వహించిన అనంతరం రవ్వలకొండలో వదిలిపెట్టారు.

బాల్య వివాహాలతో అనేక అనర్థాలు



చదువు ప్రాముఖ్యతపై అవగాహన కల్పిస్తున్న సీడీపీఓ

కోవెలకుంట్ల: చిన్న వయసులో వివాహాలు చేయడం వల్ల అనేక అనర్థాలు ఉత్పన్నమవుతాయని.. మగ పిల్లలతో సమానంగా ఆడపిల్లలను చదివించి వారి భవిష్యత్తుకు బంగారు బాట వేయాలని ఐసీడీఎస్ సీడీపీఓ ఉమామహేశ్వరమ్మ అన్నారు. మంగళవారం స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో బేటీ బచావో..బేటీ పడావో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో తల్లిదండ్రులకు అవగాహన లేకపోవడంతో ఆడపిల్లలను మధ్యలోనే చదువు మాన్పించి బాల్య వివాహాలు జరిపిస్తున్నారన్నారు. బాల్య వివాహాల వల్లే అనేక అనర్థాలు చోటు చేసుకుంటున్నాయన్నారు. 18 ఏళ్లు నిండే వరకు ఆడ పిల్లలకు వివాహాలు చేయడం చట్ట రీత్యా నేరమన్నారు. బాల్య వివాహాలు, బాలికలపై అసభ్యకర ప్రవర్త, అక్రమ రవాణా, తదితర సంఘటనలపై 1098 టోల్‌ఫ్రీకి కాల్ చేసి వివరాలు తెలియజేయాలని సూచించారు. పాఠశాల హెచ్‌ఎం అరుణకుమారి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ చంద్రమ్మ పాల్గొన్నారు.

వైద్య సేవల్లో అలసత్వం వహించొద్దు



వైద్య సేవలపై ఆరా తీస్తున్న డీసీహెచ్ఎస్ జఫురుల్లా

కోవెలకుంట్ల: ప్రభుత్వ ఆస్పత్రుల్లో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని డీసీహెచ్ఎస్ (డిస్ట్రిక్ కోఆర్డినేటర్ ఆఫ్ హాస్పిటల్ సర్వీసెస్) డాక్టర్ జఫురుల్లా సూచించారు. మంగళవారం కోవెలకుంట్ల కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను తనిఖీ చేశారు. ఆస్పత్రిలోని ఆయా వార్డుల్లో రోగులకు అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. వైద్య సేవల నిమిత్తం ఆస్పత్రికి వచ్చే ఔట్, ఇన్‌పేషంట్లకు ఎలాంటి ఇబ్బంది లేకుండా వైద్య వైద్య సేవలు అందించాలని సీహెచ్‌సీ ఇన్‌చార్జ్ డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డిని ఆదేశించారు. అనంతరం అత్యవసర చికిత్స వార్డులో అందుబాటులో ఉన్న వైద్య సేవలను పరిశీలించారు. ఆయన వెంట డాక్టర్లు నవీన్, వెంకటలక్ష్మి, సోఫియా, మెహజబీన్, నవీన్‌కుమార్‌రెడ్డి ఉన్నారు.

కేంద్ర బడ్జెట్‌లో అంకెల గారడీ చూపారు



మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ నేత మద్దిలేటి



మాట్లాడుతున్న సీపీఎం నేత నక్కి శ్రీకాంత్

- సీపీఎం, కాంగ్రెస్ నేతల ఆరోపణ

డోన్ టౌన్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో కేవలం అంకెల గారడీ తప్ప ఆంధ్రప్రదేశ్‌కు పెద్దగా ఒరిగిందేమీ లేదని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ గార్లపాటి మద్దిలేటిస్వామి, సీపీఎం పట్టణ కార్యదర్శి నక్కి శ్రీకాంత్ ఆరోపించారు. బడ్జెట్‌పై మంగళవారం ఆయా పార్టీ కార్యాలయాల్లో వేర్వేరుగా విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ మంగళవారం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఏపీకి కేటాయించిన రూ.15 వేల కోట్లు ఏజెన్సీల (ఐఎంఎఫ్, ఐబీఆర్‌డీ, ఇతర ఆర్థిక సంస్థలు)ద్వారా నిధులు సమకూర్చుతామని చెప్పడం దారుణం అన్నారు. ఈ నిధులను కేంద్రమే చెల్లిస్తుందా లేదా రాష్ట్రమే భరించాల్సి ఉంటుందా అని చెప్పకుండా అంకెల గారడీతో మభ్యపెట్టారని ఎద్దేవా చేశారు. ప్రత్యేక హోదా, ప్యాకేజీ, విశాఖ రైల్వే జోన్, పెట్రోకెమికల్ కారిడార్, విజయవాడ, విశాఖపట్నం మెట్రో ప్రాజెక్టుల ప్రస్తావన లేకపోవడం అన్యాయమన్నారు. ఎన్‌డీఏ కూటమిలో 12 ఎంపీలు ఉన్న బీహార్‌కు రూ.26 వేల కోట్లు కేటాయిపులు చేసి, 21 మంది ఎంపీలతో ఉన్న ఏపీకి కేవలం రూ.15 వేల కోట్లు ఇవ్వడం ఏంటని ప్రశ్నించారు. 40 ఏళ్ల రాజకీయ అనుభవం అని గొప్పలు చెప్పుకుంటున్న సీఎం చంద్రబాబునాయుడు ఏం చేశారన్నారు. కాంగ్రెస్ నాయకులు జనార్దన్, శేఖర్, నాగరాజు, హుస్సేన్‌వలి, సీపీఎం నాయకులు ఆశోక్, హబీబ్‌బాషా ఉన్నారు.

గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు



బేతంచెర్ల: ఆషాడ మాసం మంగళవారం సందర్భంగా అమ్మవారి ఆలయల్లో విశేష పూజలు నిర్వహించారు. పట్టణంలోని గౌరిపేటలో వెలసిన సుంకులా పరమేశ్వరీ అమ్మవారు శాకంబరి అలంకారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. బనగానపల్లె మార్గంలోని పుట్ట పెద్దమ్మకు అభిషేకాలు, అర్చనలు, పుష్పాలంకరణ, కుంకుమార్చన, నైవేద్య సమర్పణ చేసి మహా మంగళహారతులు ఇచ్చారు. ఆలయ నిర్వాహకుడు రామకృష్ణ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. అలాగే అమ్మవారిశాలలోని వాసవీ మాతకు ఆర్యవైశ్యులు, వాసవీ మహిళలు సామూహిక పూజలు చేశారు. కొలుములపల్లె రహదారిలోని చౌడేశ్వరీ దేవి, సిమెంట్ నగర్ గ్రామంలోని సుంకులా పరమేశ్వరీ దేవి ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి.

బుద్ధుడి సందర్శన లేనట్లేనా..?



బెలుం గుహల ఆవరణలోని బుద్ధుడి విగ్రహం

కొలిమిగుండ్ల: ప్రముఖ పర్యాటక కేంద్రమైన బెలుం గుహల ఆవరణలో ఏర్పాటు చేసిన బుద్ధుడి విగ్రహ సందర్శనకు అనుమతి లేకపోవడంతో పర్యాటకులు నిరుత్సాహం చెందుతున్నారు. గుహలోపలి భాగంలో బుద్ధుల కాలం నాటి అవశేషాలు లభించడంతో గుహల ఆవరణలో 65 అడుగుల భారీ బుద్ధ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. గుహలను తిలకించేందుకు దేశ, విదేశాల నుంచి పర్యాటకులు వస్తుంటారు. గుహలోపలి భాగాలు తిలకించాక బుద్ధ విగ్రహాన్ని సందర్శించేవారు. విగ్రహం కింద భాగంలో విశాలమైన ప్రదేశం ఉంది. గతంలో పర్యాటకులు ఈప్రాంతం వద్ద ఫొటోలు తీసుకుని కాసేపు సేదతీరేవారు. కొన్నేళ్లుగా బుద్ధ విగ్రహం లోపలి భాగం వరకు ఎవరూ వెళ్లకుండా పర్యాటక శాఖ అధికారులు కంచె నిర్మించి తాళం వేశారు. దీంతో యాత్రికులు బయట నుంచి తిలకించి వెనుదిరగాల్సి వస్తోంది. ఆకతాయిలు విగ్రహానికి పేర్లు రాస్తున్నారనే కారణంతో సందర్శన నిలిపివేశారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన యాత్రికులు బుద్ధ విగ్రహాన్ని పూర్తిగా తిలకించలేకపోతున్నారు. టూరిజం అధికారులు చర్యలు తీసుకుని యథావిధిగా విగ్రహం సందర్శనకు అనుమతి ఇవ్వాలని పర్యాటకులు కోరుతున్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

బేతంచెర్ల: జాతీయ రహదారి 340బీ రహదారి విస్తరణ పనుల్లో భాగంగా బేతంచెర్ల మండల పరిధిలోని ముద్దవరం, శంకలాపురం, యంబాయి సబ్ స్టేషన్ల పరిధిలోని గ్రామాలకు బుధవారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్‌శాఖ ఏడీ మధుసూదన్‌రెడ్డి తెలిపారు. ఆయా గ్రామాల్లోని రైతులు, విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

కొలిమిగుండ్ల: మండలంలోని కోటపాడు వాటర్ ట్యాంక్ వద్ద మంగళవారం పేకాట ఆడుతున్న ఐదుగురిని అదపులోకి తీసుకున్నట్లు సీఐ గోపీనాథ్‌రెడ్డి తెలిపారు. ట్యాంక్ వద్ద బహిరంగంగా పేకాట అడుతున్నట్లు సమాచారం రావడంతో దాడి చేశారు. నిందితుల నుంచి రూ.6,900 నగదు స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు సీఐ చెప్పారు. పోలీసుల దాడిలో దొరికిన పేకాటరాయుళ్లు అధికార పార్టీకి చెందిన వారేనని సమాచారం. పోలీసులు రాగానే కొంత మంది తప్పించుకున్నట్లు తెలిసింది.

టైలరింగ్‌పై ఉచిత శిక్షణ

బనగానపల్లె రూరల్: యాగంటిపల్లె కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో యువతులు, మహిళలకు టైలరింగ్, డిజైన్ బ్లౌజ్‌లు, జ్యూట్ బ్యాగుల తయారీపై ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. రెండు నెలల పాటు శిక్షణ ఉంటుందని చెప్పారు. ఆసక్తి ఉన్న వారు ఈనెల 31వ తేదీలోగా 9441192765 నంబర్‌ను సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ అవకాశాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

లెప్రసీ కేసులను గుర్తించాలి

ప్యాపిలి: గ్రామాల్లో కుష్టు వ్యాధిగ్రస్తులను గుర్తించాలని న్యూక్లియస్ వైద్యాధికారి తేజశ్వని, డిప్యూటీ పారా మెడికల్ ఆఫీసర్ రామచంద్రారెడ్డి ఆదేశించారు. మంగళవారం స్థానిక పీహెచ్‌సీలో వైద్య సిబ్బందితో సమీక్షించారు. లెప్రసి సర్వే తీరును వైద్యాధికారి నితీశ్‌ను అడిగి తెలుసుకున్నారు. సర్వే ప్రణాళిక ప్రకారం చేయాలని సూచించారు. వ్యాధి లక్షణాలు ఉన్న వారిని గుర్తించి వెంటనే వారికి మల్టీ డ్రగ్ థెరపీ నిర్వహించాలని తెలిపారు. అనంతరం పీహెచ్‌సీలో పలు రికార్డులను పరిశీలించారు.

27 వరకు మొబైల్ ఆధార్ సేవలు



బేతంచెర్లలో ఆధార్ మొబైల్ క్యాంపు

బేతంచెర్ల: మండలంలో ఈ నెల 27వ తేదీ వరకు జరిగే మొబైల్ ఆధార్ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ రవిప్రసాద్ అన్నారు. మంగళవారం యంబాయి, అంబాపురం, హెచ్ కొట్టాల, బేతంచెర్ల –2వ సచివాలయాల్లో ఆధార్ క్యాంపులను ఏర్పాటు చేశారు. ఆధార్ నమోదు, అప్‌డేట్, బయోమెట్రిక్ అప్‌డేట్‌కు అవకాశం ఉందని తెలిపారు.

బడ్జెట్‌లో దివ్యాంగులకు మొండి చేయి

కోవెలకుంట్ల: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో దివ్యాంగుల సంక్షేమానికి మొండి చేయి చూపించిందని ఆ సంఘం జిల్లా నాయకుడు అందనం దేవరాజు ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ఈ ఏడాది దివ్యాంగుల సంక్షేమం కోసం భారీగా నిధులు కేటాయిస్తుందని ఎదురు చూడగా నిరాశే మిగిలిందని తెలిపారు. దేశవ్యాప్తంగా 3 కోట్ల మంది దివ్యాంగులున్నారని.. వారి బాగోగులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోకపోవడం విచారకరమన్నారు.

చెడు అలవాట్లతో జీవితం అంధకారం



విద్యార్థులతో మాట్లాడుతున్న సీఐ

బనగానపల్లె రూరల్: చదువుకునే వయసులో ధూమపానం, మద్యపానం వంటి చెడు అలవాట్లతో జీవితం నాశనమవుతుందని.. వాటికి దూరంగా ఉండాలని సీఐ గంటా సుబ్బారావు విద్యార్థులకు సూచించారు. మంగళవారం బనగానపల్లె పట్టణంలోని ఎస్వీ జూనియర్, డిగ్రీ కళాశాలకు చెందిన విద్యార్థులతో సామాజిక భద్రత అనే అంశంపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. పొగ తాగడం, గుట్కా, మద్యం, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుంటే ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని తెలిపారు. పుట్టిన ఊరికి, తల్లితండ్రులకు గుర్తింపు తీసుకురావాలని ఆకాంక్షించారు. ర్యాగింగ్ పేరుతో భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దన్నారు. కష్టపడితే విజయం సొంతమవుతుందని పేర్కొన్నారు.

డీఎస్సీని ఆఫ్‌లైన్‌లో నిర్వహించాలి



మాట్లాడుతున్న ఎస్టీయూ నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి ఆజాంబేగ్

బేతంచెర్ల: డీఎస్సీ పరీక్షను ఆఫ్‌లైన్‌లో నిర్వహించాలని, నార్మలైజేషన్ వల్ల నష్టాలే ఎక్కువని ఎస్టీయూ నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి ఆజాంబేగ్ అన్నారు. మంగళవారం బేతంచెర్లలోని ఎస్టీయూ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం 2018 నుంచి టెట్, డీఎస్సీని ఆన్‌లైన్‌లో నిర్వహిస్తోందన్నారు. అప్పట్లో సుమారు 6 లక్షల మంది ఆన్‌లైన్ విధానాన్ని వ్యతిరేకించారని గుర్తు చేశారు. దీని వల్ల ఒక్కో స్టేషన్‌లో ఒక్కోలా ప్రశ్న ప్రతాలు ఉంటాయన్నారు. దీని వల్ల మార్కుల్లో తేడా వస్తుందని తెలిపారు. అభ్యర్థులు నష్టపోయే అవకాశం ఉందన్నారు. ఆన్‌లైన్ విధానాన్ని రద్దు చేసి ఆఫ్‌లైన్‌లో పరీక్షలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

కాలానుగుణంగా నైపుణ్యాలను పెంచుకోవాలి



వివిధ ప్రదర్శనలను ఆవిష్కరిస్తున్న విద్యార్థులు

బేతంచెర్ల: విద్యార్థులు మారుతున్న కాలానికి అనుగుణంగా విజ్ఞానం, నైపుణ్యాలను పెంచుకోవాలని, కొత్త ఆవిష్కరణలకు శ్రీకారం చుట్టాలని జెడ్పీ హైస్కూ హెచ్‌ఎం అబ్రహం అన్నారు. మంగళవారం పట్టణంలోని మెయిన్ జెడ్పీ హైస్కూల్‌లో శిక్షా సప్తాహ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు వివిధ ఆవిష్కరణలు ప్రదర్శించి ఆకట్టుకున్నారు. ఉపాధ్యాయులు హరిక్రిష్ణ, శైలజ, శ్రీనివాసులు, కళ్యాణి దేవి, సావిత్రమ్మ, జానర్ధన్ పాల్గొన్నారు.

స్వాతంత్య్ర సమరయోధుల త్యాగాలు వెలకట్టలేనివి



బాలగంగాధర్ తిలక్, ఆజాద్ చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న హెచ్‌ఎం

డోన్ టౌన్: స్వాతంత్య్ర పోరాటంలో బాలగంగాధర్ తిలక్, ఆజాద్ చంద్రశేఖర్ త్యాగాలు మరువలేనివని హెచ్‌ఎం వెంకటసుబ్బారెడ్డి అన్నారు. తిలక్, ఆజాద్‌ల జయంతిని పురస్కరించుకుని మంగళవారం పాతపేట జెడ్పీ హైస్కూల్‌లో వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులకు వారి జీవిత చరిత్రను వివరించారు. అనంతరం శిక్షాసప్తాహ్‌లో భాగంగా గణిత శాస్త్రం ఉపాధ్యాయుడు సురేష్ సంఖ్యా శాస్త్రం అభివృద్ధిని వివరించారు. అలాగే సామాజిక కార్యకర్త మహ్మద్‌రఫీ ఆధ్వర్యంలో స్థానిక గీతాంజలి హైస్కూల్‌లో ఆజాద్ చంద్రశేఖర్, బాలగంగాధర్ తిలక్ చిత్ర పటాలకు నివాళులర్పించారు.





సచివాలయం ఆవరణలో పడేసిన మద్యం బాటిళ్లు , ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో సారా ప్యాకెట్లు

మందు బాబులకు అడ్డా

కొలిమిగుండ్ల: మందుబాబుల ఆగడాలకు అడ్డూ అదుపు లేకుండా పోతోంది. ఇష్టానుసారంగా ఎక్కడ పడితే అక్కడే మద్యం సేవించి బాటిళ్లు పడేస్తున్నారు. మండల కేంద్రం కొలిమిగుండ్లలో గ్రామ సచివాలయం, ఆర్టీసీ బస్టాండ్ దగ్గరలోనే ఉన్నాయి. మందు బాబులు చీకటి పడగానే సచివాలయం, ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో విచ్చలవిడిగా మద్యం, నాటుసారా సేవించి ఖాళీ బాటిళ్లు, ప్యాకెట్లు పడేస్తున్నారు. పరిసరాలన్నీ అపరిశుభ్రంగా మారిపోతున్నాయి. కొందరు బస్టాండ్‌లోనే కూర్చొని మద్యం సేవిస్తున్నారు. నాటు సారా విక్రయాలు విచ్చలవిడిగా ఉండడంతో మందు బాబులు ఉన్న చోటకే సారా ప్యాకెట్లు అందజేస్తున్నారు. బస్టాండ్ వెనుక భాగంలో ఉన్న కాలనీకి వెళ్లేందుకు మహిళలు రాకపోకలు సాగిస్తున్నా మందు బాబులు మాత్రం యథేచ్ఛగా తమ పని కానిస్తున్నారు. బస్టాండ్‌లో ప్రయాణికుల కంటే స్థానికులు, మందు బాబులు తిష్టవేస్తున్నారు. మహిళలు, వృద్ధులు కూర్చోవడానికి స్థలం లేక నిలబడాల్సి వస్తోంది. పోలీసుల పర్యవేక్షణ లేకపోవడంతోనే మందు బాబులు ఆగడాలు మితిమీరిపోతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు.